www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 29 డిసెంబర్ 2023

5

కోనసీమ

1 నుంచి పెన్షన్లు రూ.3 వేలకు పెంపు

ప్రజాశక్తి-అమలాపురం

రానున్న జనవరి 1 నుంచి వైయస్సార్ పెన్షన్ కానుక కింద సామాజిక పెన్షన్లను రూ.2750 రూపాయల నుంచి రూ.3వేలకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి గురువారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ పథకాల అమలులో సన్నద్ధతపై సిఎం జగన్ సమీక్ష చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జనవరి ఒకటో తారీకు నుంచి జనవరి 8వ తేదీ వరకు జిల్లాలో పెంచిన పెన్షన్లను పంపిణీ చేసే కార్యక్రమం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా జరుగుతుందన్నారు. జిల్లాలోని మండలాలలో పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఏ రోజు జరుగుతుందో వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తేజంగా...

- 2వ రోజు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ
- ఆకట్టుకున్న అతిథుల ప్రసంగాలు
- పలు తీర్మానాలకు ఆమోదం

కాకినాడలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభ రెండోరోజైన గురువారం ఉత్తేజకరంగా సాగాయి. పలువురు ముఖ్యఅతిథుల ప్రసంగాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. పోరాట స్ఫూర్తిని నింపాయి. అలాగే పలువురు సౌహార్ద సందేశాలు నూతనోత్సాహాన్ని ఇచ్చాయి. రెండోరోజు పలు తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మహాసభలో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ రెండోరోజు రెట్టింపు ఉత్సాహంతో సాగింది. మొదటి రోజుకు కొనసాగింపుగా రెండోరోజు ఉదయం పలు జిల్లాల ప్రతినిధుల ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయా జిల్లాల్లో చేపట్టిన ఉద్యమాలు, ఫలితాలను వివరించారు. ఈ సమయంలో వారు నిర్బంధానికి గురికావడం, జైలుపాలవ్వడం వంటి ఘటనలను ఉదహరించారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి చేసిన కార్యక్రమాలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

అనంతరం ముఖ్యఅతిథులు మాట్లాడారు. తొలుత కష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడారు. విద్యారంగంలో వినాశకర విధానాలు అమలవు తున్నాయన్నారు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకున్న తాను 1972-82 మధ్యకాలంలో ఎస్ఎఫ్ఐలో పనిచేసే అనేక సమస్యలపై పోరాడామన్నారు. గుంటూరులో అధ్యాపకునిగా వృత్తి నిర్వహించి మూడో సారి ఎంఎల్‌సిగా పనిచేస్తున్నామన్నారు. ఈ కాలంలో నిబద్ధత, నిజాయితీగా పనిచేస్తున్నానని ఇందుకు ఎస్ఎఫ్ఐ నేర్పిన విలువలే కారణమన్నారు. ప్రజా సమస్యల పట్ల, జీవితంలో విలువలతో ఎలా బతకాలో నేర్పిందన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్, సుభాష్ చంద్రబోస్, సుందరయ్య వంటి మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కషి చేస్తుందని కొనియాడారు. విద్యలో ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ బాగా పెరిగిందన్నారు. కొఠారి కమిషన్ ప్రభుత్వ రంగంలోనే విద్య కొనసాగాలని సూచించిందన్నారు. కాని నేడు అలా జరగట్లేదన్నారు. ఎన్ఇపిని వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో వినాశకర సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. పాఠశాలల మెర్జ్‌తో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. వైసిపి అధికారంలో ఒక్క డిఎస్‌సి కూడా తీయలేదన్నారు. యూనవర్శిటీల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎయిడెడ్ కళాశాలలను గత, ప్రస్తుత ప్రభుత్వాలు నాశనం చేశాయన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐ చేపట్టబోయే అన్ని ఉద్యమాలకు పిడిఎఫ్ గా తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని లక్ష్మణరావు ఈ సందర్భంగా తెలిపారు.

16 జిల్లాల నుంచి 347 మంది ప్రతినిధుల హాజరు

మహాసభకు 16 జిల్లాల నుంచి 347 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 283 మంది ప్రతినిధులు అర్హత పత్రాల ఇచ్చారు. అందులో మండలాల నుంచి 103, టౌన్‌ల నుంచి 85, సిటీల నుంచి 63 మంది, జిల్లా కేంద్ర నుంచి 32 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభకు హాజరైన ప్రతినిధుల్లో అత్యధికంగా 15 నుంచి 18 ఏళ్ల వయస్సు వారు 101 మంది, 19 నుంచి 20 ఏళ్ల వయస్సు వారు 57 మంది, 23 ఏళ్ల లోపు వారు 75 మంది, 25 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు 41 మంది, 30 ఏళ్లకు పైగా ఉన్నవారు ముగ్గురు ఉన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన స్వేచ్ఛ(12 ఏళ్ళు) అత్యంత పిన్నవయస్కురాలు.

సమ్మెకు మద్దతుపై కృతజ్ఞతలు

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ఇస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ తీర్మానం చేసినందుకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీరాణి కృతజ్ఞతలు తెలిపారు. మహాసభలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని రోడ్డెక్కి అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుండడం శోచనీయమన్నారు. వేతనాలు పెంచడానికి డబ్బు లేదని చెబుతున్న పాలకులు, సలహాదారుల పేరుతో పెద్ద ఎత్తున సొమ్ములను దుర్వినియోగం చేయడం లేదా అని ప్రశ్నించారు. ఎన్ఇపి విద్యార్థులకే కాదు అంగన్‌వాడీలకు కూడా నష్టమేనన్నారు. ఎన్ఇపి కారణంగా అంగన్‌వాడీ సెంటర్లను విలీనం చేస్తున్నారన్నారు. ఎన్ఇపికి వ్యతిరేకంగా విద్యార్థులు, అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న పిఎన్ఎం కళారూపాలు

కాకినాడ జిల్లా పెద్దాపురం ప్రజానాట్యమండలి కళాకారులు దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, వీర్రాజు, అప్పన్న, రాంబాబు ఆధ్వర్యంలో ప్రదర్శించిన వివిధ కళారుపాలు ఆకట్టుకున్నాయి. 'ఎక్కడమ్మా నీవు లేనిది..ఏమిటి నీవు చేయలేనిది', 'నా చెమట చుక్కా నా చెమట చుక్కా' అంటూ పిల్లలు ప్రదర్శించిన నృత్య రూపకం ఆలోచింపజేసింది. సుమారు గంట పాటు ప్రదర్శించిన "పల్లె సుద్దులు" ఉత్సాహంగా సాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు పెంచి ప్రజలను ఎలా మోసాగిస్తున్నాయో, బిజెపి సర్కారు విద్యలో కాషాయీకరణను తీసుకొస్తూ విద్యా రంగాన్ని ప్రమాదంలో ముంచెత్తుతున్న విధానాన్ని వివరించారు. ఓటు హక్కు విలువను తెలియజేస్తూ పల్లె సుద్దులు చెప్పారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు అమృత, సమ్రత, పూజిత, అఖిల, నిఖిల, ధరణి, అరుణ్ బంగారు రాజు,గౌస్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పిఎన్ఎం కళాకారులు పల్లెసుద్దులు

నాయకుల సంఘీభావం

సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మండల సమావేశంలో సమస్యల ఏకరువు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి కుండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. 2024-25 సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ఎంపిడిఒ నాతి బుజ్జి సభ్యులకు చదివి వినిపించారు. సభ్యులు పలు సమస్యలను అధికారుల ముందు ఏకరవుపెట్టారు. పేరవరం సర్పంచ్ గంటి విజయ భారతి మాట్లాడుతూ పేరవరం లో 40 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉందన్నారు. ఆర్‌బికెలోలో ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ రైతులు అయిన కాడికి దళారులకు అమ్ముకుంటున్నా రని అన్నారు. వెలిచేరి సర్పంచ్ వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ లంక భూముల్లో తుపాను ప్రభావం వల్ల కురిసిన వర్షాలు వల్ల ఉద్యా నవన పంటలు దెబ్బతిని రైతులు నష్టాలు బారిన పడ్డారన్నారు. ఎంత మేర నష్టం వాటిలిందని అధికారులు ఇప్పటి వరకు అంచనా వేయలేదన్నారు. సమా వేశంలో జెడ్‌పిటిసి సభ్యుడు బోనం సాయిబాబా, ఉపాధ్యక్షులు పెనుమత్స బంగార్రాజు, మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరాజు, సర్పంచులు పాల నాగేశ్వ రరావు, ఎంపిటిసి సభ్యులు బాబిరాజు వేము ల వెంకన్న, పరిపాలన అధికారి టివి.సురే ంద్ర రెడ్డి, ఇఒపిఆర్‌డి.శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ కార్డులతో అంగన్‌వాడీల నిరసన

ముమ్మిడివరంలో పోస్ట్ కార్డులతో నిరసన దీక్షలో అంగన్‌వాడీలు

17వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల పరిష్కారంకోసం అంగన్‌వాడీలు సమ్మె గురువారానికి 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని పోస్ట్ కార్డుల ఉద్యమ చేసిన అంగన్‌వాడీలు నిరసన తెలిపారు.

అమలాపురం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన అంగన్‌వాడీల సమ్మె గురువారం 17వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సమ్మె శిబిరంలో పి.అమూల్య, విజయ, రత్నకుమారి, మణిమాల, దైవకప, బేబీ గంగారత్నం, ఐసిడిఎస్ ప్రాజెక్టుకు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. **మండపేట** కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని గ్రాట్యూటి అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు అంగన్‌వాడీలు పోస్ట్ కార్డు క్యాంపెయిన్ కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలు పరిష్కారం చేయాలంటూ పోస్ట్ కార్డు పై రాసి సిఎం జగన్‌కు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీలు మాట్లాడుతూ 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. రేపటి నుంచి సమ్మెను మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండపేట ప్రాజెక్ట్ అంగన్వాడీ కార్యకర్తలంతా పాల్గొన్నారు. **రామచంద్రపురం** అంగన్‌వాడీ వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం వెంటనే స్పందించాలని గురువారం పోస్ట్ కార్డులను సిఎం జగన్‌కు పోస్ట్ చేశామని యూనియన్ నాయకులు తెలిపారు. అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె గురువారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. కనీస వేతనాలు పెంచాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్లు అందజేయాలని, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని, నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలం నుంచి 400 మంది అంగన్‌వాడీ వర్కర్లు ఆయాలు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు నూకల బలరాం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం, దుర్గా, వరలక్ష్మి, జహీరా, తదితరులు ప్రసంగించారు. **ముమ్మిడివరం** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద జయలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్ వాడీ కార్యకర్తలు మరియు సహాయకులు చేస్తున్న నిరసన సమ్మెలో ప్రభుత్వ తీరు మారాలంటు ముఖ్యమంత్రి జగన్‌కు పోస్టు కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఒక పక్క నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనంతో పాటు గ్రాట్యుటీ ఉద్యోగ భద్రత కల్పించాలి అని సమ్మె చేస్తుంటే సమస్యలను పరిష్కరించకుండా అణచి వేసే చర్యలకు పాల్పడటం అన్యాయ మన్నారు. ఈ నిరసనలో పలువురు మహిళలతో పాటు అంగన్‌వాడి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు దుర్గా మహేశ్వరి, విజయ, జి.మంగాయమ్మ, కనకదుర్గ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా రాష్ట్ర యూనియన్ పిలుపు మే రకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోస్ట్ కార్డు పై రాసి సిఎం జగన్‌కు పోస్ట్ చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే ఉద్యమం ఉదతం చేస్తామని హెచ్చరించారు. **కొత్తపేట** తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ కొత్తపేట అంగన్వాడీలు గురువారం పోస్ట్ కార్డుల తో నూతన నిరసన కార్యక్రమం చేపట్టారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద రాష్ట్ర సంఘం సిఐటియు పిలుపుమేరకు తమ డిమాండ్లను పోస్ట్ కార్డు పై వ్రాసి రాష్ట్ర ముఖ్యమంత్రి కి పోస్ట్ చేశారు తమ డిమాండ్లు నెరవేర్చా లని నినాదాలు చేశారు అనంతరం ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు పి.వెంకటలక్ష్మి, కె.సూర్య కళ, ఇందిరా రాణి తదితరులు మాట్లాడుతూ నాలుగేళ్లు అయినా తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో పోస్ట్ కార్డులతో నిరసన దీక్షలో అంగన్‌వాడీలు

మండపేట పోస్టు కార్డులతో అంగన్‌వాడీల నిరసన

అమలాపురంలో..

కొత్తపేటలో..

మామిడికుదురులో..

కార్టూ'నిజం'

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముమ్మిడివరంలోకార్మికులకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె చేపట్టారు. గురువారం సమ్మె మూడో రోజుకుచేరింది.

మండపేట సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం మూడవ రోజుక చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు బంగారు కొండ, కొమారపు నరేంద్ర కుమార్, లోవరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** మున్సిపాలిటీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ చేయాలని మాజీ ఎంఎల్ఎ, టిడిపి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ దాట్ల సుబ్బరాజు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్టా శివ ప్రసాద్ అద్వర్యం లో రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది.ఈ సమ్మెలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన చేస్తున్న కార్మికులకు సుబ్బరాజు బందం మద్దతు తెలిపింది. సమ్మె చేస్తున్న కార్మికులకు సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పాము బాలయ్య తదితరులు మద్దతు తెలిపారు. నిరసనలో మున్సిపల్ కార్మికులు ఎస్.అరుణ్ కుమార్, నక్కా అరుణ్ కుమార్, ఎం.శ్రీనివాసరావు, కాశి జార్జి, జి.రమేష్, ఎస్.శరత్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. రాష్ట్రకమిటి పిలుపులో భాగంగా రామచంద్రపురంలో సమ్మెకు దిగిన సిఐటియు మున్సిపల్ కార్మికులను సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, గోరిపర్తి నాగభూషణం కార్మికులను కలిసి మాట్లాడారు. మున్సిపల్ వర్కర్స్ కి అంగనవాడి వర్కర్స్ మద్దతు తెలియజేశారనీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో పిల్లి వెంకటరావు, గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, గోరిపర్తి భీమశంకర్, ముత్యాల నాగరాజు, గూడుపు చిన్న అప్పారావు , మందపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మండపేటలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కేక్ కట్ చేస్తున్న ఎంపిపి భవాని

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రావిచెరువులో రాక్‌చర్చి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపిపి అంబటి భవాని పాల్గొన్నారు. అనంతరం కేకు కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ కనికెళ్ల ఆనంద్ కుమార్, మేరీ కుమారి, అంబటి నెహ్రూ, కె.కనకరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకంపై అవగాహన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మండలంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నందు గురువారం విశ్వకర్మ యోజన పథకం పై చేతి వృత్తి దారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. అనాతవరం సర్పంచ్ మిమ్మితీ చిరంజీవి మాట్లాడారు. సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు... విజయాలు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పలు పోరాటాలు చేసింది. సామాజిక బాధ్యతగా ప్రజా సమస్యలపైనాస్పందించింది. రాష్ట్ర మహాసభలకు వచ్చిన పలువురు ప్రతినిధులు ఆయా జిల్లాల్లో జరిగిన పోరాటాలు, విజయాలు, ఎదుర్కొన్న నిర్బంధాలను ప్రజాశక్తితో పంచుకున్నారు. వాటిలో కొన్ని....

• నిర్బంధాన్ని ఎదుర్కొన్నా..

సంక్షేమ వసతిగృహాల్లో మెస్‌ఛార్జీలు పెంచాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, కుక్, కమాటీ, వాచ్‌మ్యాన్ పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో 2023లో చలో కలెక్టరేట్‌ను నిర్వహించాం. ఈ సందర్భంగా పోలీసులు నన్ను లక్ష్యంగా చేసి లాఠీఛార్జి చేయడానికి ప్రయత్నం చేశారు. మెన్ ఎస్ఐ బలవంతంగా లాక్కెళ్లి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. జీపులో ఎక్కించి దాడి చేశారు. అప్పట్లో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. అక్రమ అరెస్టులపై, అణచివేత చర్యలను నిరసిస్తూ పోలీసులు తీరుపై ఆందోళన చేశాం. చివరకు జిల్లాలో ఉన్న అన్ని హాస్టళ్ల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నాయకులతో చర్చించి 167 సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగానే ఇవి పరిష్కారం అయ్యాయి. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలపై మరిన్ని పోరాటాలు చేస్తాం.

- ఎం.సౌమ్య,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు, విజయనగరం జిల్లా

• జాబ్ క్యాలెండర్ పోరాటంలో లాకప్‌లో పెట్టారు

2021 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేవలం 10 వేల పోస్టులతో జాబు క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఖాళీ పోస్టులు లక్షల్లో ఉండగా అరకొర ఉద్యోగాలు భర్తీ కోసం మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో నిరుద్యోగులంతా స్వచ్ఛందంగా ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐగా వారికి మద్దతు తెలిపాయి. కలెక్టరేట్ వద్ద 3గంటల పాటు ధర్నా నిర్వహించాం. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశాం. గేట్లు తోసుకుంటూ వెళ్లి ఆందోళన ఉధృతం చేశాం. అయినా అధికారులు స్పందించలేదు. మరుసటి రోజు ఎంఎల్ఎకు వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్తుంటే దౌర్జన్యంగా పోలీసులు మమ్మల్ని అందరినీ ఈడ్చుకుని వెళ్లి అక్రమంగా అరెస్ట్ చేసి లాకప్ లో పెట్టారు. నిర్బంధాన్ని నిరసిస్తూ రెండో రోజు రాస్తారోకో ద్వారా పోలీసులు తీరును నిరసిస్తూ ఆందోళన చేశాం.

- అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు

• ఎయిడెడ్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాం

2021-22లో భీమవరం డిఎన్ఆర్ ఎయిడెడ్ కళాశాల, నరసాపురం వైఎన్ ఎయిడెడ్ కళాశాలలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద పోరాటం తలపెట్టాం. దీంతో పోలీసులు విద్యార్థి సంఘం నాయకులతోపాటు 47 మంది విద్యార్థులపై అక్రమంగా కేసులు బనాయించారు. ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామంటూ తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్ చేశారు. అయినా వెనక్కి తగ్గకుండా ఉద్యమాన్ని సాగించాం. ఎస్ఎఫ్ఐ పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఎయిడెడ్‌ను ప్రయివేటుపరం చేయడాన్ని నిలిపేసింది. అలాగే పెనుగొండ ఎస్‌వికెపి డిగ్రీ కాలేజీలో ఓ విద్యార్థి ఎన్‌సిసి శిక్షణకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. క్యాంపు నిర్వహకుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందడంతో ఎస్ఎఫ్ఐగా విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనలు చేపట్టాం. పోరాటం ఫలితంగా చివరకు మరణించిన విద్యార్థి కుటుంబానికి అధికారులు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు.

-టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, పశ్చిమగోదావరి

• హాస్టల్ భవనాల కోసం పోరాటం

2007లో ఏర్పడిన కృష్ణా యూనివర్సిటీ 2019 వరకు అద్దె భవనంలో నిర్వహించారు. సుమారు 5 వేలు మంది విద్యార్థులున్న ఈ యూనివర్సిటీకి 2019-20 మధ్యకాలంలో సొంత భవనాలను నిర్మించారు. అయితే వసతిగృహాలు నిర్మాణం చేపట్టలేదు. దాంతో ఎస్ఎఫ్ఐగా అనేక ఉద్యమాలు చేశాం. 2023 ఫిబ్రవరిలో ఎంసిఎ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇద్దరు మహిళా విద్యార్థులు ప్రైవేటు అద్దె భవనంలో ఉండడం వల్ల కరెంటు షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. వారికి న్యాయం జరిగే వరకూ ఎస్ఎఫ్ఐ పోరాడింది. చలో యూనివర్సిటీ కార్యక్రమం ద్వారా అధికారులను కదిలించాం. చివరకు స్పందించిన యంత్రాంగం చర్చలకు పిలిచింది. అప్పటి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్ సహా మిగిలిన నాయకులను పోలీసులతో విచక్షణారహితంగా దాడి చేయించారు. క్రూరంగా ప్రవర్తించారు. అయినా పోరాటాలను ఆపలేదు. చివరకు యూనివర్సిటీ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వం మూడు నెలల క్రితం శంకుస్థాపన చేసింది. త్వరలో నిర్మాణ పనులు కూడా పూర్తయే అవకాశం ఉంది.

- సిహెచ్.రాజేష్, కృష్ణా యూనివర్సిటీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

• నాలుగు రోజుల పాటు నిరవధిక దీక్ష

వసతిగృహాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం నాతో పాటు మరో ఏడుగురు నాలుగు రోజులు పాటు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టాం. రెండవ రోజు పోలీసులు దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. అక్రమంగా అరెస్టు చేసేందుకు అర్ధరాత్రి వచ్చారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. నాలుగు రోజుల దీక్షలు నేపథ్యంలో నిరసనలో ఉన్న వారి ఆరోగ్యాలు బాగా క్షీణించాయి. అయినా యంత్రాంగం పట్టించుకోలేదు. దీంతో పెద్ద ఎత్తున విద్యార్థులతో చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చాం. ఆ కార్యక్రమాన్ని నిలుపుదల చేయించిన అధికారులు ఎస్ఎఫ్ఐ నాయకులను దీక్షలు విరమింపజేసి చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చారు. మా పోరాటం ఫలించింది.

- సామంతుల సమీర, ప్రొఫెషనల్ స్టూడెంట్స్ నెట్ వర్క్ కన్వీనర్, విజయనగరం జిల్లా

నేరాలు ఘోరాలు

సారా కేసులో రూ.25 వేల జరిమానా

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సారాయి కేసులో ముద్దాయి నుండి రూ.25 వేలు జరిమానా వసూలు చేసి గురువారం ప్రభుత్వానికి జమ చేసినట్లు కాకినాడ నార్త్ స్టేషన్ ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కె.రామమోహనరావు తెలిపారు. మాధవపట్నం గ్రామానికి చెందిన నురుకుర్తి వెంకటలక్ష్మి పలుమార్లు సారాతో పట్టుబడగా ఆమెను తహశీల్దారు ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఆయన ఆదేశాలతో ఆమె నుంచి జరిమానా వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేసినట్లు వివరించారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కోటనందూరు

కోటనందూరు దళిత కాలనీలో నత్తల మేరీకి చెందిన తాటాకిల్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యింది. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. తుని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెలగా వెంకటకష్ణాజీ, వైస్ ఎంపిపి కొరుప్రోలు కృష్ణ, సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి దొరబాబు బాధితురాలిని పరామర్శించి బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.

బోడసకుర్రును ఒఎన్‌జిసి దత్తత తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం (అల్లవరం)

బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద 'వికసిత భారత్' కార్యక్రమం గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం తరపున ముఖ్యఅతిథిగా ఐఎఎస్ అధికారి శోభిత్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్నటువంటి ఒఎన్‌జిసి చమురు సంస్థల ద్వారా రూ.కోట్ల సహజ విక్షేపాలను తీసుకు వెళ్తున్న కేంద్ర అనుబంధ సంస్థ అయిన ఒఎన్‌జిసి బోడసకుర్రు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరుతూ ఈ విషయం కేంద్రానికి నివేదించవలసిందిగా విజ్ఞాపన పత్రాన్ని శోభిత్ గుప్తా కు అందజేశారు. కార్యక్రమానికి డిపిఒ కష్ణకుమారి, డిఎల్‌పిఒ బొజ్జి రాజు, ఎంపిడిఒ కష్ణ మోన్, తహశీల్దార్ ప్రసాద్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

47 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి -మామిడికుదురు

మాకనపాలెం లో ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి లో 47మందికి గురువారం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు ఇళ్ల పట్టాలు పంపిణి చేశారు. ఆయన మాట్లాడుతూ పేదవారికి నీడ కలిపించలనే లక్ష్యం ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ మద్దాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ పూర్తి చేసుందుకు సహకరించాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

పట్టణానికి వచ్చిన రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని గురువారం కెఆర్ఎస్ఎస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు కలుసుకుని కోటిపల్లి-నరసాపురం రైల్వే ప్రాజెక్ట్ వేగంగా పూర్తి అయ్యేందుకు సహకరించాలని విన్నవించారు. ఈ విషయంపై ఆమె సానుకూలంగా స్పందించారు. రైల్వే లైన్ కు కేంద్రం అన్నివిధాలా సహకరిస్తోందని, ఇప్పటికే రూ.1100 కోట్ల కుపైగా నిధులు విడుదల చేసిందన్నారు. తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కెఆర్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, బి.యస్.మూర్తీ, ఎర్రమిల్లి పాండురంగారావు, ఎరగార్త వెంకటేశ్వరరావు, పోలిశెట్టి శివాజీ తదితరులు ఉన్నారు.

పురందేశ్వరిని కలిసిన వికలాంగులు

మండపేట జిల్లా అమలాపురంలో పర్యటిస్తున్న బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని మండపేట నియోజకవర్గం కో కన్వీనర్ కంకటాల మురళీకష్ణ, బిజెపి జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జిల్లా ఉపాధ్యక్షులు నీరుకొండ శివశంకర్ తో కలిసి పలువురు వికలాంగులు వారి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ విషయాన్ని అధిష్టానం దష్టికి తీసుకుని వెళతానని వికలాంగుల అభివద్ధికి సహకరిస్తానని పురందేశ్వరి అన్నారు.

శ్రీనివాసరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్ల గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న బైర్రాజు ఫౌండేషన్ వద్ద గురువారం నడింపల్లి శ్రీనివాసరాజు 14వ వర్ధంతి గురువారం నిర్వహించారు. శ్రీనివాసరాజు కుమారుడు నడింపల్లి దిలీప్ వర్మ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మాజీ ఎంఎల్ఎ, పార్టీ ఇంచార్జ్ దాట్ల సుబ్బరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇవిఎంలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని కేశవరం గ్రామ పంచాయతీలో ఇవిఎంలపై అవగాహనా సదస్సు మండల వ్యవసాయ అధికారి ఏసుబాబు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఇవిఎంలో ఏ విధంగా ఓటు వేయాలి, అది పనిచేయు విధానం తదితర ప్రక్రియను అధికారులు ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి ఉండమట్ల వాసు, వైసిపి నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, ఎఎంసి డైరెక్టర్ సమతం చిన పాపారావు, సచివాలయ సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

భూములను దోచుకునేందుకే టైటిలింగ్ యాక్ట్

ప్రజాశక్తి-కొత్తపేట

భూములను దోచుకునేందుకే వైసిపి ప్రభుత్వం టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చిందని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు ఆరోపించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గుట్టుచప్పుడు కాకుండా అక్టోబరు నుంచి అమలులోకి వచ్చేలా వైసిపి ప్రభుత్వం జిఒ నెంబర్ 512 జారీ చేసిందన్నారు. భూహక్కు చట్టం తీసుకురావడం రాజ్యాంగ హక్కులను కాలరాయడం కనుకనే న్యాయవాదులు పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్ర మంలో గుత్తుల పట్టాభిరామారావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేసి జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు జార్జి సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, హైకోర్టు తీర్పు మేరకు టెండర్ల విధానం ఉపసంహరించాలని, ఉద్యోగ భద్రత కల్పిం చాలని, ఆరులైన వారందరినీ రెగ్యులర్ చేయాలని, సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నామని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనియెడల 22 మండలాల గ్రామపంచాయతీ కార్మికుల ఐక్యం చేసి సమ్మెబాట పెడతామని హెచ్చరిక చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్ల గడుస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందిందని కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్న వేతనాలు ఇతర సౌకర్యాలు, జిఒలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో కె.నాగప్రసాద్, ఎస్.నరసింహామూర్తి, పణికుమార్, సతీష్, శ్రీనివాస్, వేమలరావు ,నిమ్మకాయల వెంకటేష్, పాము బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'రౌండ్ టేబుల్'

సమ్మెలకు పూర్తి మద్దతు

ప్రజాశక్తి-అమలాపురం

అంగన్‌వాడీ, ఎస్ఎస్ఎ, మున్సిపల్ సంఘాల సమ్మె నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం అమలాపురం నందు గురువారం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్,, నూకల బలరామ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీ సమ్మె 17వ రోజుకి చేరుకుందన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. సిఎం జగన్‌కి అంగన్‌వాడీల సమ్మె గురించి తెలియదనిమంత్రి బొత్స సత్యనారాయణ చెప్పడం, సిఎం దష్టికి తీసుకెళ్తామని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు.ఇంత సమ్మె జరుగుతున్న సిఎంకు తెలియదు అనటం రాష్ట్రాన్ని ఎలా పరిపాలిస్తున్నారో అర్థం అవుతుందన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు కూడా సమ్మెలో ఉన్నారన్నారు. వీళ్ళ గురించి మాట్లాడే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించే అంతవరకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా ఉద్యోగులను బెదిరించడం దారుణమని అన్నారు. టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి వాదా ప్రసాద్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.సత్యనారాయణ, ఆశ నాయకులు ఎస్తేరు రాణి, సీత, మిడ్డే మీల్ నాయకురాలు సత్యవేణి, బిల్డింగ్ నాయకులు మోహనరావు, పంచాయతీ నాయకులు వెంకటేష్, అంగన్‌వాడీ నాయకులు దుర్గమ్మ, దైవకప, కెవిపిఎస్ నాయకులు తులసిరావు మాట్లాడారు. టిఎన్‌టియుసి నాయకులు కాసిన జయనాథ్, ఆశ, బిల్డింగ్, మిడే మీల్, వ్యవసాయ, పంచాయితీ, యుటిఎఫ్, అంగన్‌వాడీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

పరామర్శిస్తున్న ఛైర్‌పర్సన్ రాణి

పట్టణంలోని 29, 30, 20,8, 4వ వార్డులలో ఇటీవల అనారోగ్య సమస్యలతో పలువురు మృతి చెందారు. మృతుల కుటుంబాలను మున్సిపల్ ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గురువారం పరామర్శించారు. వాసిరెడ్డి యేసు, జ్యోతుల సత్యనారాయణ, గహసారథి కొడమంచిలి సుబ్బారావు కుమార్తె కొడమంచిలి వరపుత్ర, సచివాలయ కన్వీనర్ మీసాల రమణ అత్త కొత్తపల్లి జానకమ్మ, పడాల సుబ్బన్న కుటుంబాలను రాణి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వార్డ్ కౌన్సిలర్లు పిల్లి శ్రీనివాసు, మారిశెట్టి సత్యనారాయణ, వైసిపి నాయకులు మొండి మురళి, రెడ్డి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

15 మందికి పోషకాహార కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెతో మూతపడ్డ అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో తెరుచు కుంటున్నాయి. కె.గంగవరం మండలంలోని ఎర్ర పోతవరంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జ్యోతి గర్భిణులకు కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసిన బియ్యం అటుకులు పోషకాహారలకిట్లను 15 మంది గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికే పలు కేంద్రాల్లో తాళాలను సచివాలయ సిబ్బంది తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిట్లు సరుకులు పంపిణీ చేస్తున్నారు.

ఎస్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మామిడికుదురు

నూతన కార్యవర్గానికి సన్మానం

మామిడికుదురు మండల ఎస్‌టియు శాఖ సర్వసభ్య సమావేశం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందుకొమ్ముల వీర రాఘవరావు అధ్యక్షతన జరిగింది. మండల శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ్ బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ములు వీర రాఘవ రావు, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ రజి, అభయ్ కన్వీనర్ వలవల శ్రీ బాలాజీ, ఉపాధ్యాయిని వాణి, కన్వీనర్ వడ్లమూడి రాజు, సిపిఎస్ కన్వీనర్ నేల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నేరేడుమిల్లి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉండపల్లి సత్యనారాయణ, పోతంశెట్టి దొరబాబు, మట్టా నాగరాజు, బత్తుల రమేష్ బాబు, వలవల రాజా, కెవి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు. విశిష్ట అతిధులు ఎంఇఒ.లు లక్ష్మీ నారాయణ, మోకా వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం విద్యుత్ ఉప కేంద్రం 33/11 కెవి ఫీడర్ పరిధిలో మరమ్మతులు మరియు ట్రీ కట్టింగ్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ అమలాపురం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం రవి కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఆనాతవరం, అయినాపురం ముమ్మిడివరం ఎంహెచ్ క్యూ 1, ఎంహెచ్ క్యూ11, ఆర్ డ్వెస్ , ఠానేలంక, కొత్త లంక ఫీడర్లు పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, పర్మినెంట్ చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ కళాశాల్లోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో రాష్ట్ర జెఎసి పిలుపులో భాగంగా చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని గురువారం సూర్యారావు సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. వీరికి ఎస్‌టియు, యుటిఎఫ్ సంఘాలతో పాటు కార్మిక సంఘాలు సిఐటియు నాయకులు జి.దుర్గా ప్రసాద్, కారెం వెంకటేశ్వర రావులతో పాటు పలువురు ఎంఇఒలు మద్దతు తెలిపారు. సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఎంపికైన రమేష్‌కు సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



సత్కరిస్తున్న స్వరూపరాణి, సురేష్‌బాబు దంపతులు

గోపవరానికి చెందిన తాళ్ల రమేష్ ఎస్ఐ పరీక్ష ఫలితాల్లో ఎస్ఐ ఉద్యోగానికి అర్హత సాధించాడు. గురువారం రాత్రి సరిపల్లి లో సర్పంచ్ గెడ్డం స్వరూపరాణి ఇంటి వద్ద జరిగిన క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన రమేష్‌ను సర్పంచ్ స్వరూపరాణి సురేష్ బాబు దంపతులు, సంఘస్తులు సత్కరించారు. అలాగే రమేష్ తల్లిదండ్రులు మణి రాంబాబులను అభినందించారు. అంబేద్కర్ ఆలోచన విధానంలో నడిచి రమేష్ పేదరికంను జయించి కష్టపడి చదివి ఎస్ఐ ఉద్యోగంకు ఎంపిక కావడం అభినందనీయమని సర్పంచ్ స్వరూపరాణి సురేష్ బాబు దంపతులు కొనియాడారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

ప్రజాశక్తి-ఆలమూరు

విద్యార్థుల్లో ప్రాథమిక దశలోనే సృజనాత్మకత వెలికి తీసినప్పుడే, అది వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడుతుందని డివైఇఒ లక్ష్మీ నరసింహ అన్నారు. కొత్తూరు గవర్నమెంట్ హైస్కూల్, నర్సిపూడి హైస్కూల్ లలో వాటి కాంప్లెక్స్ సమావేశాలను గురువారం సందర్శించి, ఉపాధ్యాయులకు కొన్ని సలహాలు సూచనలు చేశారు. ఈ స్కూళ్ల కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు పివివిజిఎస్ఎన్.మూర్తి, బి.శ్రీనివాసరావులు నిర్వహించారు. కార్యక్రమంలో మండపేట ఎంఇఒ నాయుడు రామచంద్రరావు, స్థానిక ఎంఇఒలు పి.సాలెంరాజు, పి.సుబ్బరాజు, హెచ్ఎం జివివి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల క్రీడా పోటీల నిర్వహణ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ పోటీలను ప్రారంభించారు.

ఆలమూరు మండలంలోని చొప్పెల్లలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గ్రామ స్థాయిలో జరిగే క్రికెట్ పోటీలను సర్పంచ్ దంగేటి చంద్రకళ, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి తదితరులు హాజరై గురువారం లాంఛనంగా ప్రారంభించారు. **మండపేట** మండలంలోని కేశవరం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తనయుడు తోట పథ్వీరాజ్ ఆడదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఎంపిపీ ఉండమట్ల వాసు, ఎఎంసి చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను బుధవారం డిఎల్‌డిఒ కెవిథామస్, ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి పర్యవేక్షించారు. ఈ పోటీలను వారు తిలకించి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. వారి వెంట మండల విద్యాశాఖ అధికారి ఎస్.సత్య కృష్ణ, పీడీలు కామన మధుసూదనరావు, ప్రసాద్ రాము ఉన్నారు.

ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వాలని నిరసన

ప్రజాశక్తి-రాజోలు

నిరసన తెలుపుతున్న బోట్స్‌మెన్, ఫిష్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ప్రభుత్వం తక్షణమే రాజోలు నెంబం-1 రీచ్‌లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చి మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని బోట్స్ మెన్, ఫిష్ మెన్ కో- ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు కోరారు. గురువారం రాజోలు పాత బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న రీచ్ నెంబర్ -1 దగ్గర నిరసన వ్యక్తం చేశారు. సొసైటి అధ్యక్షుడు బర్రి సత్యనారాయణ మాట్లాడుతూ తమ సొసైటీలో సుమారు 170 మంది సభ్యులు ఉన్నారని అందులో ఎక్కువ మంది గోదావరిని నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. సొసైటీ కి మొత్తం పది ఇసుక బోట్లు ఉన్నాయని ఒక్కో బోటు లో ఐదుగురు సభ్యులు వెళ్లి ఇసుక తీసుకుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. గత మూడు నెలలుగా ప్రభుత్వం ఇసుక తవ్వకాలను ఆపి వేయడంతో మాకు జీవనాధారం లేక కుటుంబ పోషణ భారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చింతా వెంకట నారాయణ, బొమ్మిడి మహేష్, కొల్లు కొండ రాజు, పెమ్మాడి శ్రీను, కర్రి వెంకటేశ్వరరావు, చింతా రమణ, బొమ్మిడి ఏసు, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - యానాం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాసుపత్రి డిడి టి.రవిశంకర్ అన్నారు. గురువారం గిరియంపేట, సావిత్రి నగర్ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. లబ్ధిదారులచే వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 10 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ స్టవ్‌లను డిడి రవిశంకర్, మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ పంపిణీ చేశారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 151 మందికి ఎక్సరే, క్షయ తదితర పరీక్షలు చేశారు.

రాకెట్ సైన్స్‌పై అవగహన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం స్థానిక వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో రాకెట్ సైన్స్ పై గురువారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో సైంటిస్ట్ డా.యాళ్ళ శివ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రాకెట్ సైన్స్ పై విద్యార్థులకు అవగహన కలిగించారు. సెమినార్ అనంతరం కళాశాల మేనేజ్మెంట్, సిబ్బంది, విద్యార్థులు సైంటిస్ట్ ప్రసాద్,సతీమణి సుజాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహరావు, ప్రిన్సిపల్ కెఎస్‌విఎన్.మనోహర్, ఆంధ్ర సేవారత్న కరాటం ప్రవీణ్, ఎస్.పద్మినీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేసింది. కాంగ్రెస్ పార్టీ అని నియోజకవర్గ కన్వీనర్ గెడ్డం సురేష్ బాబు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణ లో గురువారం వడ్డీ నాగేశ్వర రావు అధ్వర్యం కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పత్సమట్ల ఉదయ భాస్కర వర్మ గోడీ భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మేట్లకు శిక్షణ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మూడు గ్రామాలకు చెందిన 40 మంది ఉపాధి హామీ మేట్లకు శిక్షణ ఇచ్చారు. వీరికి ఎంపిడిఒ కెఎస్.గౌరీ కుమారి, ఉపాధి ఎపిడి డి. రాంబాబు, అమలాపురం క్లస్టర్ ఎంటిసి కళ్యాణి, టిఎ.అనిల్ లు ఉపాధి పనుల్లో పాటించాల్సిన విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ వి.రాజామణి సిబ్బంది పాల్గొన్నారు.

లింక్ దస్తావేజు పోయినది

అడబాల రత్నకుమారి, W/o.అడబాల వెంకటేశ్వర రావు, డోరునెం.1-21 ఉసులు మర్రు గ్రామం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో నివశిస్తున్న నా యొక్క **1558/2004 తేది.7-5-2004** నెంబర్లు గల లింక్ దస్తావేజు ది.**20-12-2023**వ తేదీన నేను ఇల్లు మార్చుకొన్న సందర్భంలో ఉసులు మర్రు మార్గం మధ్యలో పడిపోయినది. ఎంతవెతికినా కనిపించ లేదు. కనుక పై నెంబరు గల లింక్ దస్తావేజు ఏవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయ వలసిందిగా కోరుచున్నాను.

అడబాల రత్నకుమారి, W/o.అడబాల వెంకటేశ్వరరావు
డోరునెం.1-21, ఉసులుమర్రు గ్రామం,
తూర్పుగోదావరి జిల్లా. సెల్: 9154634219

సామర్లకోట పురపాలక సంఘం
ఇంజనీరింగ్ విభాగము

ఆర్.ఒ.సి. నెం. 557/2023-ఇ1 తేది.28-12-2023

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘం 15వ ఆర్థిక సంఘ నిధులు (2020-21), జిజిఎమ్‌పి నిధులు మరియు జనరల్ నిధులతో ఎస్టిమేట్ కాంట్రాక్టు విలువ రూ. 33.26 లక్షలుతో 10 పనులను చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిని ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

1. షెడ్యూల్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది : ది. 29-12-2023 ఉదయం గం॥ 10.30ల నుండి
2. టెండర్లు స్వీకరణకు ముగింపు తేది : ది.05-01-2024 సాయంత్రం గం॥ 5.00ల వరకు

తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in నందు 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ వెబ్‌సైట్ నందు పొందవచ్చు.

సం/- **కమిషనరు**
సామర్లకోట పురపాలక సంఘం